జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శుక్రవారం | 1-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 660 పేజీలు: 4 వెల : రూ.7



# రహదారులు.. రక్తసిక్తం!





* పైడిభీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకూ హైవేలో నిత్యం ప్రమాదాలు
* పోలీసుల హెచ్చరికలు పట్టించుకోని వాహనచోదకులు
* అతివేగంతో గాల్లో ప్రాణాలు
* ఇటీవల వరుసగా రోడ్డు ప్రమాదాలు
* హెల్మెట్ ధరించివుంటే ప్రాణాలు పోయేవి కాదంటున్న పోలీసులు
* కన్నోళ్లకు కడుపుకోత

**శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 30 (వార్త):** శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకూ ఉన్న జాతీయ రహదారిలో ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో పెద్ద ఎత్తున వాహనచోదకులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అతివేగం వద్దు అని, హెల్మెట్ ధరించాలని జిల్లా పోలీసులు నిత్యం ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నా వాహనచోదకులు పట్టించుకోకపోవడంతో రెప్పపాటులో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. వెరసి జాతీయ రహదారి రక్తసిక్తమవుతోంది. ఈ రెండు మూడు రోజుల్లో జరుగుతున్న ప్రమాదాలను గమనిస్తే.. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయినవారే ఉన్నారు. పూసపాటిరేగ మండలం పేరాపురం వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి మండలానికి చెందిన ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. అలాగే భోగాపురం సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆగివున్న లారీని ఢీకొని మృత్యువాత పడ్డారు. పలాస మండలం అల్లుకోల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు గాయపడగా, అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. గొప్పిలి నుంచి పలాస వైపు ప్రయాణికులతో వెళుతున్న ఆటో హరిసాగరం చెరువు రోడ్డులో అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. క్షతగాత్రులు మెళియాపుట్టి మండలం గోకర్ణ పురం వీఆర్వో లీలారాణి, మందస మండలం, కుడుమ సింగికి చెందిన ఆటో డ్రైవర్ సవర జేమ్స్, హైదరాబాద్ వాసి రెంటికోట అల్లుడు ఇప్పిలి సంపత్, మెళియాపుట్టి మండలం కరజాడ కు చెందిన కే.త్రినాద్, పలాస మండలం రెంటికోట, అల్లుఖోల లకు చెందిన అచ్చమ్మ, దువ్వాడ లక్ష్మి దేవితో పాటు మరొకరిని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమించడంతో ప్రాథమిక చికిత్స అనంతరం టెక్కలి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాద సమయంలో ఆటోలో తొమ్మిది మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలాకి మండలం సుసరాం గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఉరజాం గ్రామానికి చెందిన సంపతి రావు వైకుంఠరావు బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన కారు అతని ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ చోదకుడు వైకుంఠరావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎస్ఐ రంజిత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే నందిగాం, మండలం కొత్త అగ్రహారం జడ్యాడ రహదారిలో జడ్యాడ సమీపంలో ఆటో, ద్విచక్రవాహనం ఢీ కొన్న సంఘటనలో ద్విచక్రవాహన దారుడుకి గాయాలయ్యాయి. కొత్తఅగ్రహారం నుంచి ద్విచక్ర వాహనంపై బమ్మిడి కాంతారావు జడ్యాడ వెళ్తుండగా జడ్యాడ నుంచి కొత్తఅగ్రహారం వెళ్తున్న ఆటో ఢీ కొనగా కాంతారావు గాయాలపాలయ్యారు. పలాసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుచున్నారు. పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. అలాగే లావేరు మండలం రావివలస సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో నాలుగు వాహనాలు దెబ్బతిన్నాయి. విశాఖ నుంచి శ్రీకాకుళం వస్తున్న ద్విచక్రవాహనదారుడి హెల్మెట్ రోడ్డుపై పడిపోయింది. దాన్ని తీసుకునేందుకు రహదారి మధ్యలో ఆయన ఒక్కసారిగా వాహనం ఆపారు. దీంతో ఈ వాహనం వెనుక వస్తున్న వ్యాన్ డ్రైవర్ సడన్‌గా బండిని ఆపాడు. దీంతో దీని వెనుక వస్తున్న కారు ఈ వ్యాన్‌ను, దీని వెనుక ఉన్న బస్సు ఈ కారును ఢీకొంది. ఇలా ఒకేసారి నాలుగు వాహనాలు దెబ్బతిన్నాయి.

## అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

వాహనచోదకులు అప్రమత్తంగా ఉండి వాహనాలు నడిపితే ప్రమాదాలు నివారించవచ్చని జిల్లా పోలీసు యంత్రాంగం చెబుతోంది. హెల్మెట్ ధారణపై పోలీసులు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. హైవేపై పోలీసు వాహనాలు ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నారు. అత్యధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో బారికేడ్లు కూడా ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొందరు వాహనచోదకులు అతివేగం, నిబంధనలు పాటించకపోవడం, నిర్లక్ష్యం, అలసత్వం వల్ల ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ఇకనైనా పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటే ప్రమాదాలు నివారించవచ్చు.

# 'పది'లో.. సిక్కోలు..
# ఇదో స్థానం

* ఈసారి బాలికలే టాప్
* జిల్లాలో 90.60 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత
* సత్తా చాటిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు
* ఉత్తీర్ణత కాని విద్యార్థులు 9లోగా ఫీజు చెల్లించాలి
* ఈనెల 25 నుంచి జూన్ 4 వరకూ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష
* రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు ఈరోజే చివరి గడువు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 30(వార్త):** పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో జిల్లాలోని 90.60 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత చెందినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలు మార్చి, 2026, పరీక్షలు గత నెల 16 నుండి ఏప్రిల్ 2 వ తేదీ వరకు నిర్వహించిన పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు గురువారం ప్రకటించారు. జిల్లాలో 28.523 మంది పరీక్షకు హాజరు కాగా ప్రధమ శ్రేణిలో 21,927, ద్వితీయ శ్రేణిలో 2,858, తృతీయ శ్రేణిలో 1,056 మొత్తం 25,841 మంది ఉత్తీర్ణులైనారు. అందులో బాలురు 12,992, బాలికలు 12,849, శ్రీకాకుళం జిల్లా విద్యార్థులు 90.60 శాతంతో ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా విద్యార్థులు 90.60 శాతం ఉత్తీర్ణత చెంది 5వ స్థానంలో నిలిచారు. 14627 మంది బాలుర విద్యార్థులు హాజరుకాగా 12992 మంది 88.82 శాతం ఉత్తీర్ణత చెందారని, 13896 మంది బాలికలు హాజరుకాగా 12849 మంది 92.47 శాతం ఉత్తీర్ణత చెందారు. మొత్తం 28523 విద్యార్థులు హాజరుకాగా 25841 మంది 90.60 శాతం ఉత్తీర్ణత చెందారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 21115 మంది పరీక్షలకు హాజరు కాగా 18596 మంది 88.07 శాతం ఉత్తీర్ణత చెందారని, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 7408 మంది విద్యార్థులు హాజరుకాగా 7245 మంది 97.80 శాతం ఉత్తీర్ణత చెందారని తెలిపారు. మొత్తం 28523 మంది విద్యార్థులు హాజరు కాగా 25841 మంది 90.60 శాతం ఉత్తీర్ణత చెందారని తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి టాపర్లుగా నిలిచారు. సీరపు దేవీప్రియ, పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సీరపు దేవీప్రియ 594 మార్కులు, ఆమదాలవలస మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నౌపడ చిద్విలాస 593 మార్కులు, రణస్థలం మండలం కొండములగాం ఆదర్శ పాఠశాల విద్యార్థిని నాసిక రమ్యశ్రీ 593 మార్కులు సాధించగా, శ్రీచైతన్య విద్యార్థిని 598, నారాయణ విద్యార్థిని 596 మార్కులు సాధించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. కాగా 2026 ఫలితాలలో పెయిల్ అయిన విద్యార్థులు పరీక్ష ఫీజును ఈ నెల 9వ తేదీ లోగా ఎటువంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించాలని డీఈవో తెలిపారు. ఆపరాద రుసుము రూ.50తో 10 వ తేది నుండి 25 వ తేదీలోగా హెడ్ మాస్టర్ ద్వారా, స్కూల్ లాగిన్ www.bse.ap.gov.in ద్వారా చెల్లించాలని సూచించారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 25 వ తేది నుండి జూన్ 4 వరకూ జరుగుతున్నాయన్నారు. ఇక రీ-కౌంటింగ్ లేదా రీ - వెరిఫికేషన్ ఫీజు చెల్లించుటకు ఈ నెల 1 వ తేదీ ఉదయం 10గంటల నుండి 7 వ తేదీ రాత్రి 11గంటల వరకు హెడ్ మాస్టర్ ద్వారా స్కూల్ లాగిన్ ద్వారా www.bse.ap.gov.in మాత్రమే చెల్లించాలన్నారు. ఆన్ లైన్‌లో మాత్రమే ఆప్లికేషన్ పంపించాలన్నారు. రీ-కౌంటింగ్ కు ఒక్కొక్క సబ్జెక్టు గాను రూ.500 , రీ-వెరిఫికేషన్‌కు ఒక్కొక్క సబ్జెక్టు గాను రూ.1,000 చెల్లించాలన్నారు. సీఎఫ్ఎంఎస్ ద్వారా సిటిజన్ చలానా కట్టరాదన్నారు. ఈ విషయం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గమనించాలని డీఈవో సూచించారు.

## పరీక్షల్లో విజయం.. జీవితంలో అపజయం



**మందస, ఏప్రిల్ 30(వార్త):** విధి లీలలు వింతగా ఉంటాయి.. మనుషుల జీవితాలతో ఆడుకుంటుంది.. ఎప్పుడు, ఎవరినీ.. ఏమి చేస్తోందో తెలియదు. కొన్ని సంఘటనలు హృదయ విదారకంగా ఉంటాయి. మాటల్లో కూడా చెప్పలేని బాధను మిగుల్చుతాయి. సరిగ్గా ఓ బాలికకు ఇదే జరిగింది. ఆనందంగా జీవించాల్సిన ఆమె జీవితంలో విషాదం మిగిల్చింది. అభం, శుభం తెలియని వయస్సులో అందని లోకాలకు తీసుకెళ్లింది. కానీ.. మరణించిన అనంతరం ఆమె సాధించిన విజయం పలువురిని కన్నీరు పెట్టిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన నారాయణపురం పంచాయతీలోని పెద్దకేశుపురం గ్రామానికి చెందిన తల్లీ, కుమార్తె మడియా కృష్ణవేణి, యోగేశ్వరి కలసి, పక్కనే ఉన్న జీడిమామిడి తోటకు వెళ్లారు. పిడుగులతో కూడిన వర్షం, ఈదురు గాలులు వీస్తుండడంతో.. భయపడి తిరుగుముఖం పట్టే సమయంలో పెద్ద గర్జనతో వారు ఉన్న చెట్టుపై పిడుగు పడింది. దీంతో వారిద్దరు అక్కడికక్కడే మరణించారు. మందస మండలంలోని హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ.. యోగేశ్వరి 10వ తరగతి పరీక్షలు రాసి, తల్లికి చేదోడు వాదోడుగా ఉంటోంది. ఫలితాల కోసం ఎదురు చూస్తోంది. అనుకోని సంఘటన యోగేశ్వరిని అందని లోకాలకు తీసుకెళ్లింది. కానీ.. ఆమె రాసిన పరీక్షల్లో విజయం సాధించింది. 308 మార్కులు సాధించింది. పదో తరగతి పరీక్షల ఫలితాలు రావడంతో గ్రామస్తులు యోగేశ్వరి ఫలితాలను కూడా చూశారు. మరణించిన యోగేశ్వరి విజయం సాధించడంతో వారంతా కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న యోగేశ్వరి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిందని, బతికి ఉంటే ఉన్నత చదువులు చదివి ఉండేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏమైనా.. తలరాతను శాసించే విధిని ఎవరూ ఎదిరించలేమని వారు పేర్కొన్నారు.



## 9న ముఖ్యమంత్రి జిల్లా పర్యటన

* అక్కురాడలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

**జలుమూరు, ఏప్రిల్ 30(వార్త):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఈనెల 9న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జలుమూరు మండలం ఆక్కురాడ పంచాయతీలో గురువారం ఆయన ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్ స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పాస్ బుక్కుల పంపిణీ ప్రక్రియ అత్యంత పారదర్శకగా జరగాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరాలని స్పష్టం చేశారు. ఒక్కటి కూడా మిస్ కాకూడదని సిబ్బందిని హెచ్చరిస్తూ, వివరాల నమోదులో అత్యంత జాగ్రత్త వహించాలని సూచించారు. అలాగే జలధార జల హారతి కి సంబంధించి గ్రామంలో జరుగుతున్న పనులను కూడా పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నామని ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి తెలిపారు. సభా ప్రాంగణం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా పార్కింగ్ జోన్లను నిర్ధారించామని, ఎక్కడా తోపులాటలు జరగకుండా బారికేడ్ల నిర్మాణం చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. వివిఐపిల రాక, ప్రజల రాకపోకల విషయంలో ప్రోటోకాల్ కచ్చితంగా పాటించాలని, శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుంటూనే, ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. సీఎం పర్యటనకు ముందు జరిగే సాధారణ కసరత్తులో భాగంగా.. లబ్ధిదారుల జాబితా ప్రదర్శన, సభకు వచ్చే ప్రజలకు తాగునీరు, నీడ వంటి సౌకర్యాల కల్పనపై జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సమీక్షించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ట్రైనీ హరిఓం పాండియా , శ్రీకాకుళం రెవిన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూష, టెక్కలి డీఎస్పీ డి లక్ష్మణరావు,వివిధ శాఖల అధికారులు, తాసిల్దార్ జన్ని రామారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## పలాస ప్రెస్‌క్లబ్‌లో నేడు వైద్య శిబిరం

**పలాస, ఏప్రిల్ 30 (వార్త):** మే డే సందర్భంగా పలాస జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో ఈ శిబిరం జరుగుతుందని పలాస ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సీహెచ్ నేతాజీ తెలిపారు. ఉచితంగా మందుల పంపిణీతో పాటు, వికలాంగులకు, వృద్ధులకు అవసరం మేరకు రవాణా సదుపాయం కల్పిస్తామన్నారు. ఎవరికైనా సందేహాలు ఉంటే 7981088011, 9553868818 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## రెవెన్యూ పెట్రోల్ బంక్‌కు స్థల పరిశీలన

**మెళియాపుట్టి, ఏప్రిల్ 30 (వార్త):** మెళియాపుట్టిలో పెట్రోల్ బంక్‌కు టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి గురువారం స్థల పరిశీలన చేశారు. టెక్కలి-మెళియాపుట్టి రోడ్డు మార్గంలోని పాత తహసీల్దార్ కార్యాలయ స్థలాన్ని ఐఓసీఎల్ మేనేజర్, ఆర్డీవో కృష్ణమూర్తి పరిశీలించారు. వీరి వెంట తహసీల్దార్ పాపారావు ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, మండల సర్వేయర్ శ్యామల రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆశాలత, సంబంధిత శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## కిడ్నీ మృతుల కుటుంబాలకు పరామర్శ




**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 30 (వార్త):** బూర్జపాడు గ్రామంలో బుంగ యోగి (14) కిడ్నీ వ్యాధితో రెండు రోజుల క్రితం మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ కుటుంబాన్ని వైస్సార్సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. ఈ ప్రాంతం లో కిడ్నీ వ్యాధులకు గురై మరణిస్తున్న వారి సంఖ్య బట్టి డేంజర్ బెల్ మోగుతున్నట్లు అనిపిస్తుందని వైస్సార్సీపీ నాయకులు సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి అన్నారు. బూర్జపాడులో 10 రోజుల్లో ఇద్దరు కిడ్నీ వ్యాధితో మరణించారని, ఈ గ్రామంలో మంచి నీటి సరఫరా కొన్ని నెలలుగా జరగడం లేదని ఫిబ్రవరి 19 న జిల్లా కలెక్టర్‌కి తెలియజేయగా, వాటర్ ట్యాంకర్స్ అందించి, మళ్లీ నిలిపి వేశారని వాపోయారు. వాటర్ పైప్ లైన్‌కు మరమ్మతులు పూర్తి చేయకపోవ డంతో వేసవిలో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారన్నారు. జల్ జీవన్ మిషన్ పనులు ఆగిపోయాయన్నారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, చల్ల దేవరాజు తదితరులు ఉన్నారు.

## ఇచ్ఛాపురంలో ఎగ్ కార్ట్‌లు ప్రారంభం




**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 30 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 17వ వార్డులో గురువారం ఎగ్ కార్ట్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మునిసిపల్ కమిషనర్ రమేష్, పట్టణ టీడీపీ అధ్యక్షులు పత్రి తవిటయ్య, 17వ వార్డు ఇంచార్జి జన్నెల సంతోష్ విచ్చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు కాళ్ల జైదేవ్, కో క్లస్టర్ ఇన్ చార్జ్ జిలాని, 17వ వార్డు ప్రెసిడెంట్ వినయ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. 23వ వార్డు బెల్లుపడా కాలనీలో మరో ఎగ్ కార్ట్ ప్రారంభించారు. ఈ పథకం ద్వారా పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి, రాష్ట్ర ఆర్థికవ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని స్థానికులు అభిప్రాయ పడ్డారు.

## శెలగపేటలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం




**సంతబొమ్మాళి, ఏప్రిల్ 30(వార్త):** శెలగపేటలో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కస్పా నౌపడ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ జర్జాన ప్రవీణ్ కుమార్ 73 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వెన్ను మోకాళ్ళ నొప్పులు, డయాబెటిస్, శ్వాస సమస్యలు, చర్మ రోగాలు, ఇతర దీర్ఘకాలిక సమస్యలకు మందుల పంపిణీ చేసి, ఎండాకాలంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రతలు తెలిపారు. ఆయుర్వేదం పై ఉన్న అపోహలు వదిలి, ప్రజలకు ప్రాచీన వైద్యాన్ని మరింత చేరువ చేసే ఉద్దేశంతో ఆయుర్వేద వైద్య శిబిరాలను ప్రభుత్వం వారు నిర్వహిస్తున్నారని, ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. నిత్యం వైద్యశాలలో ఉచిత యోగ శిక్షణ వంటి సేవలు ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులతో పాటు యోగా గురువులు చంద్ర శేఖర్, ఉషారాణి, ఆసుపత్రి సిబ్బంది పద్మావతి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పెద్ద కొవ్వాడలో మత్స్యకారులకు అవగాహన సదస్సు




**రణస్థలం, ఏప్రిల్ 30(వార్త):** పెద్ద కొవ్వాడలో గురువారం కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి.హరికృష్ణారావు, వారి సిబ్బంది.. గ్రామ పెద్దలు, మత్స్యకారులు, గ్రామ విజిలెన్స్ కమిటీ సభ్యులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వేట నిషేధం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. అనుమానస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. నిషేధిత వస్తువులు అక్రమ రవాణా చేసినా తక్షణమే కళింగపట్నం మెరైన్ పోలీస్ వారికి గానీ, స్థానిక పోలీసులకు తెలిపాలని కోరారు. కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్ 1093 లేదా కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ ఎస్.హెచ్.ఓ. ఫోన్ నెంబర్ 9392914712 తెలియజేయాలని సూచించారు.



## కంచిలి కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

**కంచిలి, ఏప్రిల్ 30(వార్త):** కంచిలి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాల యం బాలికలు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. 36 మందికి 33 మంది ఉత్తీర్ణులయ్యారు. ఆసి సంధ్య 573, మరల వర్ష 558, కప్ప మహేశ్వరి 539 మార్కులు సాధించారు. 500కు పైగా 11 మంది బాలికలు మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

# ఎస్ఎస్‌సీ ఫలితాల్లో టాప్ లేపారు

**- లోలుగు ఎంజేపీ స్కూల్ రికార్డు**
**- శత శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు**
**- అభినందించిన ఉపాధ్యాయులు**



**పొందూరు, ఏప్రిల్ 30(వార్త):** ఎస్ఎస్‌సీ ఫలితాల్లో లోలుగులోని ఎంజేపీ ఏపీ బీసీ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ దాసరి హేమంత్ తెలిపారు. ఎ.రాజేష్ 547, సీహెచ్‌సీ 541 మార్కులు సాధించారన్నారు. 500 పైబడి మార్కులు 12 మంది సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

## పది ఫలితాల్లో మెరిసిన విద్యా కుసుమాలు

**మెళియాపుట్టి, ఏప్రిల్ 30 (వార్త):** పదవ తరగతి పరీక్షల ఫలితాలలో మండలానికి చెందిన పలువురు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రయోజనం సృష్టించారు. విద్యాశాఖ అధికారులు గురువారం ఉదయం విడుదల చేసిన 10వ తరగతి పరీక్ష ఫలితాల నేపథ్యంలో మండలంలోని అన్ని పాఠశాలలకు సంబంధించి 687 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా దాంట్లో 647 మంది ఉత్తీర్ణత సాధించగా, 40 మంది ఫెయిల్ అయినట్టు విద్యాశాఖధికారులు దేవేందర్ రావు, మల్లారెడ్డి పద్మనాభంలు తెలిపారు. అందులో మండలంలో బాలికలు అత్యధికంగా ఉత్తీర్ణత సాధించారని తెలియపరుస్తూనే, కొసమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కలవల గోపిచంద్ 586 మార్కులు సాధించి మండలంలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలువగా చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కమ్మకట్ల జనని రెడ్డి 585 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారని, అలాగే అదే పాఠశాలకు చెందిన దట్టి జీవిత 578 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారన్నారు. మండలంలో 94.18 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలియపరుస్తూనే మండలంలో నడసంద్ర,



గొప్పిలి, భరణికోట, మెళియాపుట్టి కేజీబీవీ పాఠశాలల నుంచి శతశాతం ఫలితాలు సాధించడంతో ఉపాధ్యాయులను, విద్యార్థులను మండల విద్యాశాఖధికారులు దేవేందరరావు పద్మనాభంలోలు అభినందించారు. అత్యధిక మార్కులు సాధించి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం పట్ల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తపరిచారు.

## పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రభంజనం



**పలాస, ఏప్రిల్ 30 (వార్త):** పదో తరగతి ఫలితాల్లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పాఠశాల నుంచి 190 మంది పరీక్షలు రాయగా, 162 మంది ఉత్తీర్ణులయ్యారు. గీతిక పాత్రో-578, జి.జితేంద్ర వెంకట్ -577, షేక్ సలాలుద్దీన్ -570 మార్కులు సాధించారు. 13 మంది 550కి పైగా మార్కులు, 45 మంది 500కి పైగా మార్కులు సాధించారు. పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రవికు మార్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రోణంకి రాజ్యలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ కె.తారక్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.తవిటయ్య, ఆర్.సోమేశ్వరరావు, పి.కృష్ణారావు, ఎం.కిరణ్‌కుమార్, వై.శ్రీనివాసరావు, కె.స తీష్ కుమార్, డి.యువరాజ్, ఎ.ఆనందరావు, జి.అప్పారాజు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

### బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ..


పదో తరగతి ఫలితాల్లో బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. శత శాతం ఉత్తీర్ణత సాధించారు. మద్దిల చాందిని 566, వంకల లక్ష్మీ ప్రసన్న 564, సార అక్షిత 563, పాతిని మేఘన 562, జడే పూజ 560, మహేష్ మహరణ 560 మార్కులతో మెరిశారు. 500 మార్కులు దాటి 23 మంది సాధించారు. విద్యార్థులకు బొడ్డపాడు మాజీ యువజన సంఘం అధ్యక్షులు, టీడీపీ నాయకులు కిక్కిర ఢిల్లీరావు శుభాకాం క్షలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు వీర్రాజు, ఉపాధ్యాయ బృందానికి, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ గర్తం తులసీరావు, కమిటీ మెంబర్స్‌కు అభినందనలు తెలియజేశారు. టాప్ టెన్ విద్యార్థులకు నగదు బహుమతులను ఆగస్టు 15న బహుకరిస్తానన్నారు.

## సత్తా చాటిన టెన్త్ విద్యార్థులు

**- రెండు పాఠశాలల్లో శత శాతం ఉత్తీర్ణత**
**- సంతబొమ్మాళి మండలంలో 88 శాతం మంది పాస్**

**సంతబొమ్మాళి, ఏప్రిల్ 30(వార్త):** పదో తరగతి పరీక్ష ఫలితాలలో మండలంలో పలువురు విద్యార్థులు సత్తా చాటారు. ఈ ఏడాది మండలంలోని 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల తో పాటు బోరుభద్ర లోని ఒక ప్రవైట్ పాఠశాల తో కలిపి 643మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 568 మంది ఉత్తీర్ణత సాధించి 88శాతం నమోదైంది . ఈ ఫలితాలలో సంతబొమ్మాళి ఎం జె పి పాఠశాల కు చెందిన శివ హరీష్ అంజంగి 591/600 మార్కులు సాధించి మండలం లో టాపర్స్ గా నిలిచాడు. అలాగే అదే పాఠశాల నుంచి తమ్మినేని సాయికుమార్ 588/600 మార్కులు సాధించి మండలంలో రెండో స్థానంలో నిలవగా దండుగోపాలపురం ఉన్నత పాఠశాల విద్యార్థి ని మద్దెల రమ్య 581/600 మార్కులు సాదించి మండలం లో మూడో స్థానం కైవసం చేసుకుంది. అలాగే ఎంజేపీ పాఠశాల కు చెందిన పందిరి చిరంజీవి 580/600మార్కులు సాధించి మండలం లో నాలుగో స్థానంలో నిలిచాడు. ఈ ఏడాది మండలంలోని వడ్డివాడ పాఠశాల లో 12మంది పరీక్షలు రాయగా 12మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే వివేకానంద ప్రైవేట్ పాఠశాలలో 8మంది పరీక్షలు రాయగా 8మంది ఉత్తర్ణత సాధించారు . సంతబొమ్మాళి ఎం జె పి స్కూల్ లో 39మందికి 38 మంది ఉత్తీర్ణత సాధించగా, , నౌపడ పాఠశాల లో 106మంది విద్యార్థులకు 101 మంది ఉత్తీర్ణత సాధించారు. మండల కేంద్రం సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత ఉన్నత పాఠశాల లో 131మంది పరీక్షలు రాయగా 101 మంది ఉత్తీర్ణత సాధించి ఫలితాల్లో వెనకబడింది. గత ఏడాదో పోల్చి చూస్తే ఈ ఏడాది ఈ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం గణనీయంగా తగ్గిపోయింది. గత ఏడాది మండలం టాపర్లు ఈ పాఠశాల నుంచే ఎంపిక కావడం విశేషం. ఇక పోతే మండలంలో జగన్నాధపురం పాఠశాల నుంచి 12మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8మంది ఉత్తీర్ణత సాధించి మండలంలో అత్యాల్పంగా 66 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సత్తా చాటిన విద్యార్థులకు తల్లితండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.






## పది ఫలితాల్లో శాంతినికేతన్ జయకేతనం



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 30 (వార్త):** పదో తరగతి ఫలితాల్లో ఇచ్ఛాపురంలోని శాంతి నికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. యన్.మోహన్ ప్రియ -579, (తండ్రి ఆటో డ్రైవర్), పి. జిహారిక -538(తండ్రి మెకానిక్), సీహెచ్ దామిని -530 (మధ్యతరగతి కుటుంబం) కె.అఖిల-529(తండ్రి కూలీ), బికాస్ బేహేరా -513(తండ్రి కూలీ), బి.లిఖిత -509(తండ్రి రైతు), బి.ప్రవీణ్-505(తండ్రి కూలీ), సంజీవ్-501(తండ్రి డ్రైవర్) మార్కులు సాధించారు. ఈ విద్యార్థులను స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి అభినందించి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో మేనేజర్ కేసీ పూరి, ఉపాధ్యాయులు సురేఖ, శ్రీధర్, పద్మజ, రాజ్యలక్ష్మి, శాంతి, యశోద, జయలక్ష్మి, మీనా స్నేహ, సరోజిని, పార్వతి, ప్రమీల, ప్రియ పాల్గొన్నారు.

## స్వర్ణభారతి విద్యార్థుల ప్రతిభ



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 30 (వార్త):** ఇచ్ఛాపురంలోని స్వర్ణభారతి విద్యా సంస్థల విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో అఖండ విజయం సాధించారు. పి.తేజస్ 585మార్కులతో విజయకేతనం ఎగురవేశాడు. అగ్ర గామిగా నిలిచిన ఆ విద్యార్థిని.. విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీదాసరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చాట్ల సుజాత, కరస్పాండెంట్ రాము, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ అభినందించారు. 500కి పైగా మార్కులు 22 మంది విద్యార్థులు సాధించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

## రాణించిన ఈదులవలస మోడల్ స్కూల్



**పోలాకి, ఏప్రిల్ 30 (వార్త):** ఈదులవలసలోని మోడల్ పాఠశాల విద్యార్థినులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటారు. గురువారం విడుదలైన ఫలితాల్లో 600 మార్కులకు గాను వినీల 586 మార్కులు సాధించి ముందంజలో నిలిచారు. కుసుమ కావ్య 582 మార్కులు సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ టాపర్లుగా నిలవడం అభినందనీయమని ప్రిన్సిపాల్ ప్రవీణ పేర్కొన్నారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

## తిలారు రైల్వే స్టేషన్ వద్ద నీరు నిల్వ

**- ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు**

**జలుమూరు, ఏప్రిల్ 30 (వార్త):** జలుమూరు మండలం తిలారు రైల్వే స్టేషన్ బయట ఆవరణలో స్వల్ప వర్షం పడినా నీరు నిల్వ ఉండిపోవడం ప్రయాణికు లకు ఇబ్బందిగా మారింది. డ్రైనేజీ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో స్టేషన్ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి నిలిచిపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు ఈ సమస్యతో ఎక్కువగా ఇబ్బందులు పడుతు న్నారని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ప్రయాణి కులు కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## బాధిత కుటుంబానికి "హెల్పింగ్ హార్ట్స్" ఆర్థికసాయం

**సంతబొమ్మాళి, ఏప్రిల్ 30(వార్త):** కొల్లిపాడు గ్రామానికి చెందిన ముద్దాడ ఎర్రయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఎర్రయ్య ప్రస్తుతం పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గోవిందపురం శ్రీ రెయ్యమ్మ తల్లి యూత్ హెల్పింగ్ హార్ట్స్ సంస్థ సభ్యులు ఆ బాధిత కుటుంబానికి ఆదుకోవడానికి ముందుకొచ్చారు. పలువురు దాతల సహకారంతో రూ.17 వేలు సేకరించారు. ఆ మొత్తాన్ని బాధిత కుటుంబానికి కమిటీ సభ్యులు గురువారం అందజేశారు. ఈ సహాయం ఆ కుటుంబ సభ్యులకు కొంతవరకైనా సహాయపడి, ధైర్యం అందిస్తుందని కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. కష్టాల్లో ఉన్న ఎర్రయ్య కుటుంబం కోసం తాము చెప్పగానే స్పందించి, సహాయం అందించేందుకు ముందుకొచ్చిన ప్రతి ఒక్క దాతకు తమ గ్రూప్ తరఫున పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# మందస కేజీబీవీ శతక్కొట్టింది

- పదో తరగతి ఫలితాల్లో అద్భుతంగా రాణింపు
- శత శాతం ఉత్తీర్ణతతో జిల్లాలోని కేజీబీవీల్లో మూడోస్థానం
- విద్యార్థినులను అభినందించిన ఉపాధ్యాయినులు

**మందస, ఏప్రిల్ 30(వార్త):** మందస (వీరగున్నమ్మపురం సమీపంలో గల) కేజీబీవీ విద్యార్థినిలు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. శత శాతం ఉత్తీర్ణతతో మండలంలో టాప్‌గా నిలిచారు. కోడి జ్యోష్న 585మార్కులతో జిల్లాలోని 25 కేజీబీవీల్లో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. 500కు పైగా మార్కులను 12మంది సాధించారు. బెహర శాలిని 574, కోడి భవ్య 569 మార్కులు సాధించారు. ఈ విద్యార్థులను ప్రిన్సిపల్ రఘుపాత్రుని వాసంతి, మాజీ సర్పంచ్‌లు కర్రి గోపాలకృష్ణ, గుంట నారాయణరావు, ఉపాధ్యాయ బృందం అభినందించి, సన్మానించారు.





## పది ఫలితాల్లో గిరిజన ఆశ్రమ విద్యార్థినుల ప్రతిభ

- 590 మార్కులతో ఐటీడీఏ టాపర్‌గా చిన్నకోస్టా విద్యార్థిని జాస్మిన్
- శత శాతం ఫలితాలు సాధించిన బుడంబో పాఠశాల

**మందస, ఏప్రిల్ 30(వార్త):** గిరిజన ఆశ్రమాల విద్యార్థినిలు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చాటారు. చిన్నకోస్టా గిరిజన బాలికోన్నత ఆశ్రమ పాఠశాల గిరిజన విద్యార్థిని బి.జాస్మిన్ 590మార్కులతో ఐటీడీఏ టాపర్‌గా నిలిచింది. జిల్లాలోనే ప్రథమస్థానం సాధించింది. మంచి ఫలితాలు సాధించిన చిన్నకోస్టా ఆశ్రమం ప్రధానోపాధ్యాయుడు కె.తిరుపతిరావును పలువురు అభినందించారు.

ఇదే ఆశ్రమంలో చదువుతున్న జి.హారిక 579 మార్కులతో జిల్లాలో ద్వితీయస్థానం, పట్టులోగాం గిరిజన బాలికోన్నత పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థిని ఎస్.ఝాన్సీ 575 మార్కులతో తృతీయస్థానం సాధించారు. శతశాతం ఫలితాలు సాధించిన గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో బుడంబో జీటీడబ్ల్యు ఆశ్రమ పాఠశాల రెండవ స్థానం పొందింది. ఎన్నడూలేని విధంగా మంచి ఫలితాలను మందస మండలంలోని ఆశ్రమ పాఠశాలలు సాధించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# పది ఫలితాల్లో కె.నారాయణ హైస్కూల్ సంచలనం

- శతశాతం ఉత్తీర్ణత
- 588మార్కులు సాధించిన కిరణ్
- శ్రమకు మంచి ఫలితాలన్న యాజమాన్యం

**మందస, ఏప్రిల్ 30(వార్త):** పదో తరగతి ఫలితాల్లో కె.నారాయణ హైస్కూల్ సంచలనం సృష్టించింది. శతశాతం ఫలితాలు సాధించింది. కుంటి కోట సూర్యానగర్‌లో గల ఈ హైస్కూల్ విద్యార్థులు కటారి కిరణ్ 588, గునిసెట్టి వినయ్ 587, గార సిద్ధు 586, సాది నవదీప్ 583, పురేటి ఫాల్గుణ ప్రసాద్ 582, మద్దు అజయ్ కుమార్ 582 మార్కులు సాధించారు. 580కి పైగా ఆరుగురు, 570కి పైగా నలుగురు, 550కి పైగా 23మంది, 500కు పైగా 50మంది విద్యార్థులు మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గుంట రోహిణమ్మ మాట్లాడుతూ చిన్న తరగతుల నుంచే బలమైన పునాది వేసి, క్రమబద్ధమైన పద్ధతిలో నేర్పినప్పుడే ఈ విధమైన ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. పాఠశాలలో ఎల్ కేజీ నుండి 8వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రగతిపై దృష్టి పెట్టి స్థిరమైన ఫలితాలను అందించడం తమ పాఠశాల ప్రత్యేకతగా పేర్కొన్నారు.



# జంట పట్టణాల్లో చెత్త నివారణకు చర్యలు

- డంపింగ్ యార్డ్‌లో సుమారు రూ.3.24 కోట్లతో ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్
- ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస, ఏప్రిల్ 30 (వార్త):** పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో చెత్త సమస్య నివారణకు చర్యలు చేపట్టామని, అనంతపురంలోని డంపింగ్‌యార్డ్‌లో సుమారు రూ.3.24 కోట్లతో ఫ్రెష్ వేస్ట్‌ప్లాంట్‌ను నిర్మిస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. గురువారం ఆమె పలాస-కాశీబుగ్గలోని డంపింగ్ యార్డ్ వద్ద ఫ్రెష్ వేస్ట్ మెటీరియల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో వ్యర్థాల సమస్య పరిష్కారానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్' (చెత్త ప్రాసెసింగ్ ప్లాంట్) నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ ప్లాంట్‌ను డంపింగ్ యార్డ్ ప్రాంతంలో 1.6 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. భారీ యంత్రాల సహాయంతో సేకరించిన వ్యర్థాలను ఈ ప్లాంట్‌కు తరలించి, వాటి నుంచి ప్లాస్టిక్, ఇనుము వంటి పునర్వినియోగ పదార్థాలను వేరు చేస్తారని, తడి, పొడి చెత్త నుండి వర్మీ కంపోస్టును తయారు చేసి, మిగిలిన వ్యర్థాలను వ్యవసాయానికి ఉపయోగపడేలా మార్చడం ఈ ప్లాంట్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ చర్యలు పర్యావరణ పరిరక్షణకు, పరిశుభ్రతకు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, పలాస మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు, టీడీపీ నాయకులు దువ్వాడ శ్రీకాంత్, సప్ప నవీన్, లొడగల కామేష్, గాలి కృష్ణారావు, ఎం.నరేంద్ర, ఎస్.రాంబాబు, టంకాల రవిశంకర్ గుప్తా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు..ఒకరికి తీవ్ర గాయాలు



**పోలాకి, ఏప్రిల్ 30 (వార్త):** పోలాకి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల మేరకు, సుసరాం గ్రామ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఉరజాం గ్రామానికి చెందిన సంపతిరావు వైకుంఠరావు బుధవారం రాత్రి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన కారు ఆయన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో వైకుంఠరావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## మే డే వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

-కార్మిక సంఘాల పిలుపు



**నరసన్నపేట, ఏప్రిల్ 30(వార్త):** నరసన్నపేటలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) వేడుకలను ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ ఆధ్వ ర్యంలో కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని నేతలు కోరారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, సంప్రదాయంగా కొనసాగుతున్న 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ధారించాలని కోరారు. హమాలీలు, నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయా లని వారు అభ్యర్థించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## సత్యవరం జెడ్‌పీ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు



**నరసన్నపేట, ఏప్రిల్ 30(వార్త):** సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచిందని హెచ్‌ఎం రత్నమాల తెలిపారు. గురువారం విడుదలైన ఫలితాల్లో పాఠశాలకు చెందిన 81 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థిని డి.హేమలత 550 మార్కులు సాధించారన్నారు. విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల శ్రమ ప్రధాన కారణమని తెలిపారు. ఈ సందర్భంగా అధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## క్రికెట్ పోటీల విజేత ఇచ్ఛాపురం



**కంచిలి, ఏప్రిల్ 30(వార్త):** ఎంఎస్ పల్లి యువకుల ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీలో ఇచ్ఛాపురం జట్టు విజేతగా నిలిచింది. సాలినపుట్టుక జట్టు రన్నరప్‌గా నిలిచింది. విన్నర్‌గా నిలిచిన ఇచ్ఛాపురం జట్టుకు రూ.7000ల బహుమతితో పాటు మెమొంటోను మాజీ సర్పంచ్ కొనపల సురేష్ అందజేశారు.

## మడపాం టోల్‌గేట్ వద్ద అక్రమ పార్కింగ్

-ప్రమాదాలకు దారి తీస్తోందని ప్రయాణికుల ఆందోళన

**నరసన్నపేట, ఏప్రిల్ 30(వార్త):** మడపాం టోల్‌గేట్ సమీపంలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై అక్రమ పార్కింగ్ సమస్య తీవ్రంగా మారుతోంది. రహదారి పక్కన లారీలు, ఇతర భారీ వాహనాలను డ్రైవర్లు వ్యక్తిగత అవసరాల కోసం నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఇలా నిర్లక్ష్యంగా వాహనాలను పార్క్ చేయడం వల్ల రహదారిపై వెళ్తున్న ఇతర వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు సంభవించే పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత పోలీసులు తక్షణమే స్పందించి అక్రమ పార్కింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, రహదారి భద్రతను కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైతే ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని సూచిస్తున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## పది ఫలితాల్లో..

# నారాయణ ప్రభంజనం

- శతశాతం విద్యార్థుల ఉత్తీర్ణత
- 590కిపైగా మార్కులు తెచ్చుకున్న 9 మంది
- 580కి పైగా 28,550కి పైగా 80 మార్కులు సాధించిన నారాయణ విద్యార్థులు
- నారాయణ ఈ-టెక్నో స్కూల్‌లో సంబరాలు
- విద్యార్థులను అభినందించిన ఆర్ఐ, ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్, తల్లిదండ్రులు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 30 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో శ్రీకాకుళం నగరంలోని మధురానగర్ కాలనీలోగల నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. శతశాతం ఉత్తీర్ణత సాధించారు. 596 మార్కులను ఇద్దరు విద్యార్థులు కైవసం చేసుకున్నారు. 590కి పైబడి 9 మంది విద్యార్థులు, 580కి పైబడి 28 మంది విద్యార్థులు, 550కిపైబడి 80 మంది, 500కు పైగా 110 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. డి.ప్రజ్ఞశ్రీ 596, కె.లిఖిత్ 596, ఎ.యశ్విని 594, కె.పూజిత 594, బి.మౌనిక 592, డి.కావ్యశ్రీ 592, ఓ.జోషిత 591, ఎస్.హర్షిక 591, జి.సత్య ప్రణీత్ 590 మార్కులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆర్ఐ రాంబాబు, ప్రిన్సిపాల్ బెహరా భాస్కరరావు, కోఆర్డినేటర్ శ్రీధర్, అకడమిక్ డీన్లు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, తల్లిదండ్రులు.. విద్యార్థులను అభినందించారు. తల్లిదండ్రుల సమక్షంలోనే విద్యార్థులు కేక్ కట్ చేశారు. మిఠాయిలు తినిపించారు. అలాగే పాఠశాల ఆవరణలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భాస్కరరావు మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం తోనే మంచి ఫలితాలను సాధించగలిగామన్నారు. 135 మంది పది పరీక్షలు రాశారని, అందరూ మంచి మార్కులు సాధించారన్నారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలను సాధించి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్.. ఆనందం..

తన ఆటోలోనే నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌కు ఏడుగురు పదో తరగతి విద్యార్థులను రోజూ తీసుకువెళ్లేవాడినని, అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారని ఆటో డ్రైవర్ బొట్ట రామారావు ఆనందం వ్యక్తం చేశారు. అందరికి కూడా 500కు పైగా మార్కులు వచ్చాయన్నారు.
















## ప్రజా రవాణా రంగాన్ని కాపాడుకుందాం



**పలాస, ఏప్రిల్ 30 (వార్త):** కేంద్రం తప్పుడు విధానాలతో ప్రభుత్వ, ప్రైవేట్ రవాణాసంస్థలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయని, ప్రయాణికుల, సరకు రవాణా రంగాల మనుగడ ప్రశ్నార్థకమైందని, మేడే స్ఫూర్తితో ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించి, రోడ్డు రవాణా రంగాన్ని, కార్మికుల జీవనోపాధిని కాపాడుకోవాల్సిన తక్షణ అవసరం ఉందని ఆర్టీసీ పలాస డిపో ఎంప్లా యీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది దువ్వాడ శ్రీధర్ (బాబా)అన్నారు. మే డే సందర్భంగా గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం, డీజిల్ ధరల పెరుగుదల, అధిక పన్నులు, మోటారు వాహనాల సవరణ చట్టంతో ఆర్టీసీలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. ఆయా సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయకపోవడం, ఔట్ సోర్సింగ్ విధానాలు, జీతాలు ఆలస్యంగా ఇవ్వడం, ఉద్యోగులకు టెర్మినల్, పెన్షన్ ప్రయోజనాలు నిలిపివేయడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన మండిపడ్డారు. ప్రైవేట్ రవాణా రంగ కార్మికులు నిరంతరం శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోటారు వాహనాల సవరణ చట్టం (2019)లోని కొత్త సెక్షన్ '93' ( అగ్రి గేటర్ ) చిన్న తరహా వాహన యజమానులను నిర్మూలించి, రవాణా రంగాన్ని ఉబర్, రాపిడో, పోర్టర్ వంటి బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్రపూరితమైన చర్య అన్నారు. కార్మికుల పాలిట మరణశాసనం లాంటి నాలుగు కార్మిక కోడ్ లను ప్రభుత్వం అమలు చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. అవి అమల్లోకి వస్తే కార్మికులకు కనీస రక్షణ ఉండదన్నారు. కార్మిక హక్కులు, ఉద్యమాలను రక్షించుకోవడానికి ప్రజా సంఘాలు మరింత ఐక్యంగా పోరాడాలని కోరారు. మే డే స్ఫూర్తితో పోరాటాలకు ప్రపంచ కార్మికులందరూ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆనందంలో అంబుగాం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

### -ఎస్ఎస్సీ ఫలితాలలో శతశాతం విజయం



**మందస, ఏప్రిల్ 30(వార్త):** అంబుగాంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎస్సీ పరీక్షా ఫలితాలలో అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది. విద్యార్థులు శత శాతం ఫలితాలు సాధించి పాఠశాల ప్రతిష్టను మరింతగా పెంచారు. మజ్జి లక్ష్మణరావు 576, మల్ల ప్రణతి 555, మజ్జి దేవి 543 మార్కులతో స్కూల్ టాపర్లుగా నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంబోటి సీతమ్మ, ఉపాధ్యాయులు సాహుకారి కోదండరాం, ఎన్.మాలతీలత, టి.దీనబంధు, పి.భాస్కరరావు, ఎస్.కిరణ్ కుమార్, కె.ధనరాజు, జి.జేజేశ్వర రావు, డి.ప్రమీల విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అద్భుత విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## చిన్న కరగాంలో నిరుపయోగంగా చెత్త నుంచి సంపద కేంద్రం

### -అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థుల ఆగ్రహం




**నరసన్నపేట, ఏప్రిల్ 30(వార్త):** కరగాం పంచాయతీ పరిధిలోని చిన్న కరగాలో నిర్మించిన "చెత్త నుంచి సంపద" కేంద్రం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ కేంద్రం వినియోగంలోకి రాకపోవడంతో గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్తను వేరు చేసి ఈ కేంద్రం ద్వారా పునర్వినియోగం చేయాల్సి ఉన్నప్పటికీ, అధికారులు దీనిపై సరైన దృష్టి సారించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. కేంద్రం నిర్మాణం పూర్తయినప్పటికీ, నిర్వహణ లోపంతో ఉపయోగం లేకుండా ఉండి పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి వల్ల గ్రామంలో చెత్త నిర్వహణ సమస్యలు పెరుగుతున్నాయని, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలు దెబ్బతింటున్నాయని వారు అంటున్నారు. వెంటనే స్పందించి ఈ కేంద్రాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## సొండిపూడి జడ్పీహెచ్ఎస్ మరోసారి విజయకేతనం



**మందస, ఏప్రిల్ 30(వార్త):** పదవ తరగతి పరీక్షా ఫలితాలలో సొండిపూడి జడ్పీహెచ్ఎస్ మరోసారి విజయ పతాకం ఎగుర వేసింది. శత శాతం ఉత్తీర్ణత సాధించింది. 500కి పైగా పదిమంది, 550కి పైగా మార్కులు ముగ్గురు విద్యార్థులు సాధించారు. గణితంలో 100 మార్కులతో వై.రూప్ కుమార్ టాపర్‌గా నిలిచాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుందర్‌సాల్మన్ గురువారం ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇచ్చిన గొప్ప బహుమతి ఈ ఫలితాలని పలువురు కొనియాడారు. చిచ్చుల నళినిశ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ తలగాన మాకమ్మమహేష్, తెలుకల సురేష్(బీజేపీ మండల అధ్యక్షుడు) ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులు, సిబ్బందిని, విద్యార్థులను అభినందించారు.

## రాణించిన విద్యా కుసుమాలు



**పలాస, ఏప్రిల్ 30 (వార్త):** పదో తరగతి పరీక్ష ఫలితాలలో వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కదిరి కిరణ్ కుమార్ 577 మార్కులతో మండలంలో ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ పాఠశాలలో ఐదుగురికి 500 పైబడి మార్కులు వచ్చాయి. వీరికి పాఠశాల ఆవరణలో స్వీట్ బాక్సులు ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి. హేమారావు, విద్యాకమిటీ చైర్మన్ బి.లక్ష్మీపతి, ఉపాధ్యాయులు కె.రమణ, టి.ఎర్రన్న, కొయ్యల శ్రీనివాసరావు, ఎల్.శ్రీదేవి, సి.హెచ్.ఉమారావు, వై.కాళి దాసు, బి.ఉత్తరకుమారి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కరవంజ మోడల్ స్కూల్‌లో శత శాతం ఉత్తీర్ణత


CHINNALA JHANSI 588/600


MERUGU YAMUNA 588/600


B NAVASURYA TAVITI NAIDU 585/600


PATTA MEGHANA 585/600


TANNI MANIKANTA 585/600

**జలుమూరు, ఏప్రిల్ 30 (వార్త):** పదో తరగతి ఫలితాల్లో కరవంజ మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. శత శాతం ఫలితాలు సాధించారన్నారు. చిన్నాల ఝాన్సీ, మెరుగు యమున 588 మార్కులు సాధించి, మొదటి స్థానంలో నిలిచా రన్నారు. 36 మంది విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించారని తెలిపారు. ఈ విజయానికి ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల క్రమశిక్షణ ప్రధాన కారణమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

# పలాస శ్రీచైతన్య పదింతల విజయం

### - 598 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండో స్థానం, జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన సాధ్విక

### - శత శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు



**పలాస, ఏప్రిల్ 30 (వార్త):** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పలాస శ్రీ చైతన్య పాఠశాల సంచలన ఫలితాలను సాధించింది. ఇప్పిలి సాధ్విక 598 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం, జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. 590 పైబడి 10 మంది, 550 పైబడి 89 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. 519 బ్రాంచ్ యావరేజ్‌తో వందశాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాకే గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో శ్రీ చైతన్య పాఠశాలల ఉత్తరాంధ్ర ఏజీఎం ఎంవీ సురేష్, రీజనల్ అధికారి ఎస్.రామినాయుడు, కోఆర్డినేటర్ ఎ.బాలరాజు, ప్రిన్సిపాల్ వై. రామ కృష్ణ, అకడమిక్ డీన్ జోగారావు, సీ-బ్యాచ్ ఐకాన్ ఇన్‌చార్జి షణ్ముఖరావు, మిడ్ స్కూల్ ఇన్‌చార్జి యుధిష్టిర్ రెడ్డి, టెన్త్ ఇన్‌చార్జి ధర్మారావు, ఏవో జయబాబు, ప్రైమరీ ఇన్‌చార్జి నీలవేణి, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జి చాందిని.. విద్యార్థులకు పుష్పగుచ్ఛాన్నిచ్చి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీడు పొలాలకు నిప్పు పెడితే .. భూసారానికి నష్టం



### - వ్యవసాయ అధికారిణి సూర్యకుమారి

**నరసన్నపేట, ఏప్రిల్ 30(వార్త):** నరసన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో రబీ పంటల అనంతరం రైతులు బీడు పొలాలకు నిప్పు పెడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఈ విధానంతో భూసారం దెబ్బతింటుందని స్థానిక వ్యవసాయ అధికారిణి సూర్యకుమారి హెచ్చరించారు. వరి, మొక్కజొన్న, పెసర తదితర పంటలను కోత పూర్తయ్యాక పొలాల్లో మిగిలిన అవశేషాలకు నిప్పు పెట్టడం వల్ల నేలలోని ముఖ్యమైన పోషకాలు నశిస్తాయని ఆమె వివరించారు. ముఖ్యంగా నత్రజని, సల్ఫర్ వంటి పోషకాలు తగ్గిపోవడంతో భూమి ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. అంతేకాకుండా, పొలాల్లో సహజంగా ఉండే మిత్ర జీవులు, సూక్ష్మజీవులు కూడా అగ్నికి గురై నశించే ప్రమాదం ఉందన్నారు. ఇది భూమి ఆరోగ్యాన్ని మరింత దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. రైతులు ఇటువంటి చర్యలను వెంటనే నిలిపివేసి, పంట అవశేషాలను సేంద్రియ పద్ధతుల్లో వినియోగించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారాన్ని కాపాడుకునేందుకు అవగాహనతో వ్యవహరించాలని ఆమె కోరారు.

# పదిలో ఇచ్ఛాపురం విద్యార్థుల విజయదుందుభి





**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 30(వార్త):** పదో తరగతి ఫలితాల్లో ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని నందిని మహారాణ 590 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవడంతో.. ప్రధానోపాధ్యాయులు కె.సూర్యారావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, సభ్యులందరూ అభి నందనలు తెలిపారు. మున్సిపల్ గర్ల్ హైస్కూల్ పాఠశాల విద్యార్థినులు సిందిరి దీక్ష 588, పొందల శ్రీహిత 587 మార్కులతో మండల స్థాయిలో ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ పాఠశాల నుంచి 500కు పైబడిన మార్కులు 22 మంది సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యా యులు బల్ల శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ గిన్ని వెంకటరమణ, స్థానిక మాజీ కౌన్సిలర్ బచ్చు జగన్, కో ఆప్షన్ సభ్యులు కృష్ణయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థినులను అభినందించారు. పురుషోత్తపురం మునిసిపల్ హైస్కూల్‌లో బుడుపు రుక్మిణి 549, పొన్నగంటి ప్రవీణ్ 536, గాలి గాయత్రి 524, కొంతాల దివ్య రెడ్డి 520, పైల శ్రావణి 506, సాడి కృష్ణవేణి 503 మార్కులు సాధించారు. వీరికి రాష్ట్ర మునిసిపల్ విభాగం వైస్సార్సీపీ కార్యదర్శి సుగ్గు ప్రేమ్‌కుమార్ స్వీట్లు పంచి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్రబాబు, శంకర్, నెయ్యల ధర్మారావు, మోహనరావు పాల్గొన్నారు. రత్తకన్నలో వినాయక విద్యానికేతన్ విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబర్చారు. పి.సంజన 582, ప్రీతి బిసాయి 580 మార్కులు సాధించారు. 500కు పైగా మార్కులు 11 మంది విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కరస్పాండెంట్ జి.కోకిల పుష్పగుచ్ఛంతో విద్యార్థులను సత్కరించారు. పురుషోత్తపురం మోడల్ స్కూల్ నుంచి 98 మందికి 94 మంది ఉత్తీర్ణులై 96% శాతం సాధించడం విశేషం పాండవ దీపక్ కుమార్-565, సాక్షి గీతిక-559, బుడ్డెపు ప్రీతి - 558, అనపాన ఏషితా - 556, హర్ష దద్దా - 549 మార్కులు సాధించారు. 26 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. పాఠశాల ప్రిన్సిపాల్ దుంపల వైకుంఠరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. పీఎంసీ చైర్మన్ తిప్పిన దుర్యోధన రెడ్డి ప్రిన్సిపాల్ ఉపాధ్యా యులను అభినందించారు.





Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546